సాక్షి
హనుమకొండ

మంగళవారం | 12 | ఆగస్టు | 2025



మూగబోయిన మహిళా చైతన్య దీప్తి

హనుమకొండకు చెందిన ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత సోమవారం గుండెపోటుతో కన్ను మూశారు. ఆమె మృతిపై సాహిత్యాభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. - 8లో ▸



లాభసాటి పంటలను ఎంచుకోవాలి

రైతులు లాభసాటి పంటలను ఎంచుకుని సాగు చేయాలని, అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాగేశ్వరరావు అన్నారు. - 8లో ▸



వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యారణ్యపురి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని డీఈఓ వాసంతితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఓ వాసంతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గీత, ఎంఈఓ నెహ్రూనాయక్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి మదన్‌మోహన్‌రావు, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ హిమబిందు హెచ్‌ఎం ఉమ ల్గొన్నారు.

మంచి పేరు తీసుకురావాలి



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌తోపాటు తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. ఇనిస్టిట్యూట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం నూతన పీజీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్‌లో ఆయన మాట్లాడారు. నిట్‌లోని అత్యుత్తమ బోధనను అధ్యయనం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఎమ్మెస్సీలో అందజేస్తున్న విద్యాబోధన, ల్యాబ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ కిరణ్‌కుమార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రుద్రతత్వమే విశ్వశక్తి



హన్మకొండ కల్చరల్ : రుద్రతత్వమే విశ్వశక్తి అని, భగవంతుడి ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ పేర్కొన్నారు. శ్రావణమాసం మూడవ సోమవారం ఉదయం రుద్రేశ్వరుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. సామూహిక రుద్రాభిషేకాలు జరుపుకున్నారు. సాయంత్రం సహస్రనామార్చనలు ప్రదోష కాలపూజలు భజనలు జరిగాయి. ఈఓ అనిల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దూర విద్య ప్రవేశాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూర విద్యాకేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ కోర్సుల్లో 2025–2026 విద్యా సంవత్సరంలో ప్రవేశాల గడువును సెప్టెంబర్ 10వ తేదీ వరకు పొడిగించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ, బీఎల్ఐఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంఎల్ఐఎస్సీ కోర్సులతోపాటు మరో తొమ్మిది డిప్లొమా, 14 సర్టిఫికెట్, ఏడు ఓరియంటేషన్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అవసరమైన సర్టిఫికెట్లు, ఫొటో జత చేసి రుసుం ఆన్‌లైన్‌లోగానీ, దూరవిద్యాకేంద్రంలో క్యూఆర్ స్కాన్‌ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.

ఎన్‌జీఓతో ఆర్ట్స్‌కాలేజీ ఒప్పందం

కేయూ క్యాంపస్: మారిన పరిస్థితులకు అనుగుణంగా మహిళలు అన్నిరంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకునే విధంగా లాంచ్ గర్ల్స్ ఎన్‌జీఓతో ఒప్పందం చేసుకున్నట్లు హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి సోమవారం తెలిపారు. ఈ సంస్థ మహిళల్లో నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లాంచ్‌గర్ల్స్ ప్రతినిధి జయవర్ధన్, కళాశాల మహిళా సాధికారిత సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ గిరిప్రసాద్ పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో అడ్మిషన్ కోసం డ్రా

న్యూశాయంపేట: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) రామంతపూర్‌లో ఒకటవ తరగతి అడ్మిషన్ కోసం వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద సమక్షంలో డ్రా తీశారు. డ్రాలో కందికట్ల హర్షిణి అనే విద్యార్థిని సెలక్ట్ అయ్యింది. మొదటి వెయిటింగ్ లిస్టుగా నీరటి జష్విక, రెండవ వెయిటింగ్ లిస్టులో చింత అద్వైత ఉన్నారు. హర్షిణి సామాజిక స్థితిని పరిశీలించి అడ్మిషన్ కోసం పంపించారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరు దరహాసం

‘ఆపరేషన్ స్మైల్.. ఆపరేషన్ ముస్కాన్‌’తో చిన్నారులకు భరోసా

- 2015 నుంచి 2,481 మంది చిన్నారులకు విముక్తి
- బాలకార్మిక రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం: పోలీసులు, అధికారులు



‘బాలలు ఉండాల్సింది బడిలో.. పనిలో కాదు’ ఈ నినాదంతో దూసుకెళ్తున్నారు వరంగల్ కమిషరేట్ పరిధి పోలీసులు, ఇతర శాఖల అధికారులు. బాలల బంగారు భవిష్యత్‌ను రక్షిస్తూ వారి పెదాల్లో చిరునవ్వులు విరబూయిస్తున్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ పేరిట విస్తృత తనిఖీలు చేపడుతూ.. బాలలకు పని నుంచి విముక్తి కల్పిస్తూ బడిలో చేర్పిస్తున్నారు. - కాజీపేట అర్బన్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఇతర శాఖల సమన్వయంతో ప్రతీ ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట 2015 నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బడీడు పిల్లలు బడిలో ఉంటేనే ఆకుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమాలను యజ్ఞంలా చేపడుతున్నారు. 2015 నుంచి 2016వ సంవత్సరం వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా, 2017 నుంచి 2021 వరకు వరంగల్ అర్బన్ జిల్లాలో, 2022 నుంచి 2025 సంవత్సరం వరకు హనుమకొండ జిల్లాలో 2,481 మంది చిన్నారులకు పనినుంచి విముక్తి కల్పించారు.

డివిజన్‌కు 8 మంది సభ్యుల బృందం..

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ డివిజన్‌లో ఎస్సై, సహాయ కార్మికశాఖ అధికారి, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, మహిళా పోలీస్ కానిస్టేబుల్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధి కారి, చైల్డ్ లైన్ అధికారులు బృందంగా పని చేస్తున్నారు. 14 ఏళ్లలోపు చిన్నారులను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు.

> వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఈఏడాది జూలైలో 177 మంది చిన్నారులకు విముక్తి కల్పించారు. వీరిలో 149 మంది బాలలు, 28 మంది బాలికలు ఉన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 97 మంది ఉన్నట్లుగా గుర్తించారు. వీరందరిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.

చట్టాలు ఇలా..

చిన్నారులను పనిలో పెట్టుకుని శ్రమ దోపిడీకి గురి చేసే యజమానులపై బాలకార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం 1996 (సవరణ 2016లో మార్పు చేసి చట్టాన్ని ది చైల్డ్ అండ్ అడాల్‌సెంట్ లేబర్ యాక్ట్ 1986) జువైనల్ జస్టిస్ యాక్ట్‌లు పరిగణనలోకి వస్తాయి.బాలకార్మికులను ప్రోత్సహిస్తూ తొలిసారి పట్టుబడితే ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.20 వేలు నుంచి 50 వేల వరకు జరిమానా విధిస్తారు. రెండోసారి అదే తప్పిదం జరిగితే ఏడాది పాటు జైలు శిక్షతో పాటు రూ.50 వేల నుంచి లక్ష వరకు జరిమానా విధిస్తారు.

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఇలా

సంవత్సరం	బాలురు	బాలికలు	కేసులు
ఆపరేషన్ స్మైల్			
2022 జనవరి	96	16	2
2023 జనవరి	86	9	4
2024 జనవరి	32	3	1
2025 జనవరి	25	6	2
ఆపరేషన్ ముస్కాన్..			
2022 జూలై	86	9	4
2023 జూలై	38	9	2
2025 జూలై	36	8	4

బాలకార్మిక వ్యవస్థ రహిత సమాజమే లక్ష్యం



ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ ద్వారా బాల కార్మిక వ్యవస్థ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నాం. బడీడు పిల్లలను బడిలో చేర్పించడంతో పాటు ఇతర రాష్ట్రాల పిల్లలను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు కృషి చేస్తున్నాం.

– జయంతి, స్త్రీ, శిశు సంక్షేమాధికారి, హనుమకొండ జిల్లా

అలా కడితే అప్పుల పాలవుతారు

- నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేట్టాలి
- గృహ నిర్మాణశాఖ ఎండీ గౌతమ్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖ ఎండీ గౌతమ్, పక్కన ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి/రామన్నపేట/కాజీపేట అర్బన్: నిబంధనల మేరకు రూ.5లక్షల వరకు వ్యయంతోనే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలని, అలా కాకుండా స్లాబ్‌ను పెంచితే అప్పుల పాలవుతారని గృహ నిర్మాణశాఖ ఎండీ వీపీ గౌతమ్ సూచించారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో, గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధి కాజీపేట మండలం న్యూశాయంపేటలో, 33వ డివిజన్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఎంత ఖర్చు అయ్యింది? ఇంకా ఎంత అవుతుందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. 600 ఎస్ఎఫ్‌టీ మేరకు స్లాబ్‌లో గోడల నిర్మాణం చేపట్టి, మరో 300 నుంచి 400ఎస్ఎఫ్‌టీ వరకు స్లాబ్ బయట పెంచినట్లు గౌతమ్ గుర్తించారు. ఇలాచేస్తే ఆర్థిక భారమై అప్పులు చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మేరకు స్లాబ్‌తో సహా 600 ఎస్ఎఫ్‌టీ నిర్మాణం చేపట్టితే ఎలాంటి భారం పడే అవకాశం ఉండదన్నారు. నాణ్యమైన ఇసుక, ఇటుక, సిమెంట్, ఇనుముతో ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. మడిపల్లిలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు సత్వరం పూర్తి చేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీసుకొచ్చి ప్రారంభిస్తానని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, బల్దియా కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ్ నాయక్, తహసీల్దార్లు ప్రసాద్, బావుసింగ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, కార్పొరేటర్ మామిండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులపై ఆరా..



వివరాలు సేకరిస్తున్న హౌసింగ్ ఎండీ గౌతమ్

ధర్మసాగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి తెలుసుకునేందుకు రాష్ట్ర హౌసింగ్ ఎండీ గౌతమ్ సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. అనంతరం వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని హౌసింగ్ ఏఈ సుష్మాను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసిన వారికి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్దార్థ్, డీఈ రవీందర్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంపీఓ అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

కాపర్‌వైర్ దొంగల అరెస్ట్

- 250 కిలోల కాపర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి

ఎల్కతుర్తి: పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైరును అపహరిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన బండి కుమారస్వామి, బండి సతీష్‌లు గత కొంత కాలంగా ఎల్కతుర్తి, వేలేరు, భీమదేవరపల్లి, సైదాపూర్, హుజూరాబాద్, శంకరపట్నం తదితర ప్రాంతాల్లో రాత్రివేళల్లో 27 ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి వాటిలోని కాపర్ వైర్‌ను అపహరించారు. దానిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తన సిబ్బందితో సోమవారం భీమదేవరపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అడ్డుకున్నారు. వారివద్ద కాపర్‌వైరు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టేందుకు ఉపయోగించే వస్తువులు ఉండడాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా సులువుగా డబ్బులు సంపాదించేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన కాపర్ వైర్‌ను ముల్కనూర్ గ్రామానికి చెందిన రుద్రాక్ష తిరుపతికి అమ్మినట్లు విచారణలో తేలింది. వెంటనే తిరుపతిని కూడా అదుపులోకి తీసుకున్నారు. గతంలో నిందితులపై 2012నుంచి 53 కేసులు నమోదైనట్లు ఏసీపీ వెల్లడించారు. కాగా, నిందితులనుంచి రూ.2.50లక్షల విలువ గల 250 కిలోల కాపర్ వైర్, మోటర్ సైకిల్‌ను స్వాధీనపర్చుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ పులి రమేష్, ఎస్సైలు సాయిబాబు, ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెహికల్ ట్రాకింగ్ యాప్‌పై అవగాహన అవసరం

బల్దియా కమిషన్ చాహత్ బాజ్‌పాయ్



ట్రాకింగ్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

రామన్నపేట : వెహికల్ ట్రాకింగ్ అప్లికేషన్‌పై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు అవగాహన అవసరమని కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గల ఐసీసీసీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వాహనాల ట్రాకింగ్ తీరును అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ వాహనాల స్థితిగతులను నమోదు చేసుకుని పూర్తినివేదికను తనకు అందజేయాలన్నారు. అదేవిధంగా హనుమకొండ బాలసముద్రంలోని వెహికల్ షెడ్డును తనిఖీ చేశారు. వెహికల్ షెడ్డు ప్రాంతంలో గుడిసెవాసులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో శానిటేషన్ వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి పాల్గొన్నారు.

‘అక్షయపాత్ర’కు ఇవ్వొద్దని మంత్రి ఇల్లు ముట్టడి

మధ్యాహ్న భోజన కార్మికుల అరెస్ట్



మంత్రి కొండా సురేఖ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు, సీఐటీయూ నాయకులు

హన్మకొండ: వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయా మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన వర్కర్లు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి ఇంట్లోకి ప్రవేశించకుండా గేటు వేసి అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులు, సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన వర్కర్ల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోలీసుల చర్యలను అడ్డుకున్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, వరంగల్ జిల్లా కార్యదర్శి అరూరి రమేష్, నాయకులు వాణి, ప్రభాకర్, ఉపేందర్‌తో పాటు మధ్యాహ్న భోజన వర్కర్లను అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన వర్కర్లు బైరబోయిన సరోజినీ యాదవ్, జారతి దేవి, కవిత, స్వర్ణలత, పుష్పలీల, రమ, మనెమ్మ, మల్లికాంబ, ఉమాదేవి, లక్ష్మి అనసూర్య, వనజ, సంధ్య, రీటా, సరిత, పద్మ, అరుణ, యాకలక్ష్మి, రజియా సుల్తానా, జకియా బేగం, షంషాద్, ప్రమీల, శ్రావణి, మంజుల పాల్గొన్నారు.

హనుమకొండలో 175 వినతులు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ వైవీ గణేష్

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం అధికారులు నిర్వహించిన ప్రజావాణిలో వివిధ రకాల సమస్యలపై ప్రజలనుంచి 175 వినతులు స్వీకరించినట్లు డీఆర్‌ఓ వైవీ గణేష్ తెలిపారు. అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, కె.నారాయణ, సీపీఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మన కుక్కల్ని ఏం చేద్దాం?

‘గ్రేటర్’ పరిధిలో వీధి కుక్కల బెడద

- ప్రజావాణిలో ఒక్కరోజే నాలుగు ఫిర్యాదులు
- వీధులనుంచి పునరావాస కేంద్రాలకు తరలించాలని వినతి
- జంతు సంరక్షణ చట్టం నిబంధనలతోనే బల్దియాకు మహా సంకటస్థితి
- ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో కుక్కలపై సుప్రీం ఆదేశాల నేపథ్యంలో చర్చ
- ఇక్కడ కూడా డాగ్ షెల్టర్ జోన్లు పెంచితే మంచిదంటున్న జనం



సాక్షి, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో గుంపులు గుంపులుగా తిరుగున్న కుక్కలపై ఫిర్యాదులు రాగానే అక్కడినుంచి పట్టుకెళ్లి డాగ్ షెల్టర్లకు తరలించాక కుటుంబ నియంత్రణ, రేబిస్ వ్యాక్సిన్లు ఇచ్చి మళ్లీ నగరంలోనే వదిలేస్తుండడతో కుక్కల సంఖ్య యథావిధిగానే ఉంటోంది. జంతు సంరక్షణ చట్టం (ఏడబ్ల్యూపీఐ) 1960 , 2023 నిబంధనల ప్రకారం ఇదంతా చేస్తున్నా జనాలు మాత్రం కుక్కలు తీసుకెళ్లి మళ్లీ ఇక్కడే వదిలేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ నగరంలో మొత్తం 28,460 వీధి కుక్కలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఓవైపు ఢిల్లీలో వీధి కుక్కల్ని డాగ్ షెల్టర్లకు తరలిస్తుంటే ఎవరైనా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అక్కడి సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో మన కార్పొరేషన్ పరిధిలోనూ వీధి కుక్కల్ని డాగ్ షెల్టర్లకు శాశ్వతంగా తరలించే కార్యక్రమం చేపట్టాలనే డిమాండ్ నగరవాసుల నుంచి వస్తోంది. అదే సమయంలో జంతు ప్రేమికులు మాత్రం వీధి కుక్కల పట్ల కఠినంగా ఉండొద్దని, కాటు వేసే కుక్కల్ని గుర్తించి రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చి సురక్షిత ప్రాంతంలో ఉంచాలంటున్నారు. ఇటు జనాలు, అటు జంతు ప్రేమికుల మధ్యలో కార్పొరేషన్ నలిగిపోతుందనే చర్చ నడుస్తోంది. ఇక్కడ కూడా నగర శివారుల్లో డాగ్ షెల్టర్ జోన్లు పెంచాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కంట్రోల్‌లోకి తెచ్చేందుకు మహా ప్రయత్నం

వాస్తవానికి ఆరు నెలలు దాటి ఏడాది వయస్సున్న కుక్కల్ని కుటుంబ నియంత్రణకు బల్దియా అధికారులు తీసుకెళ్తున్నారు. దాదాపు 12 నుంచి 15 సంవత్సరాలు బతికే ఈ కుక్కలకు ఒక్కో ఆడ కుక్క ఏడాదికి రెండు ఈతలు.. దాదాపు 16 కుక్కపిల్లలకు జన్మనిస్తుంది. అంటే ఐదేళ్లలో ఒక్కో కుక్క 90 పిల్లల వరకు జన్మనిస్తుంది. గతేడాది 2024–25 సంవత్సరంలో రూ.68 లక్షలకుపైగా ఖర్చు చేసి 6,154 కుక్కలకు కుటుంబ నియంత్రణతో పాటు రేబిస్ వ్యాక్సిన్లు ఇచ్చారు. మూడురోజుల పాటు సంరక్షించాక జనావాసాల్లోకి వదిలారు. కొన్ని సంవత్సరాలుగా వేలల్లో ఉన్న కుక్కలకు కుటుంబ నియంత్రణతో కంట్రోల్‌లోకి తేగలిగామని, ఇప్పటికి వాటిపైనే దృష్టి కేంద్రీకరించామని చెబుతున్నారు. ఇంకోవైపు సమస్యాత్మక ప్రాంతాల్లో బహిరంగ ప్రాంతాలతో పాటు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నామంటున్నారు.

ఫిర్యాదు చేయాలంటే..

కుక్క కాటు వేస్తే 18004251980తో పాటు ప్రజారోగ్య అధికారి ఫోన్ నంబర్ 9701999689, మున్సిపల్ ఆరోగ్య అధికారి ఫోన్ నంబర్ 9701999639 పశువైద్యాధికారి ఫోన్ నంబర్ 9701999701కు వాట్సాప్ మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ ద్వారా ఫిర్యాదులు చేయొచ్చు. ప్రతీరోజు 12 నుంచి 15 ఫిర్యాదులొస్తున్నాయి. షెల్టర్ జోన్లకు కుక్కలను తరలించేందుకు 12మందితో మూడు బృందాలు పనిచేస్తున్నాయి.

> ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ టెరిటరీతోపాటు నోయిడా, గుర్గావ్, ఘజియాబాద్ ప్రాంతాల్లో అన్ని వీధి కుక్కలను డాగ్ షెల్టర్లకు ఎనిమిది వారాల్లో తరలించాలి. ఈనేపథ్యంలో వీధి కుక్కలను అధికారులు తీసుకెళ్లకుండా ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ అడ్డుకుంటే, వారు చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది’.
>
> - తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలు

> ‘కాజీపేటలోని ప్రశాంత్ నగర్, కాకతీయ కాలనీ ఫేజ్–టు, వరంగల్‌లో రంగశాయిపేట, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో వీధి కుక్కల్ని తీసుకెళ్లాలి. వరుస కాట్లతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ బెడద నుంచి కార్పొరేషన్ అధికారులు తప్పించాలి.
>
> - సోమవారంనాటి బల్దియా ప్రజావాణిలో వచ్చిన నాలుగు ఫిర్యాదులు

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న వీధి కుక్కలు: **28,460**
రేబిస్ వ్యాక్సిన్ వేసిన వీధి కుక్కల సంఖ్య: **6,154**
కుటుంబ నియంత్రణ చేసిన కుక్కల సంఖ్య: **6,154**
వీటి కోసం ఇప్పటివరకు చేసిన ఖర్చు : రూ. **68,23,936**
కుక్కల తరలింపు కేంద్రాలు : చింతగట్టు, హసన్‌పర్తి, హనుమకొండ
వీటిలో ప్రస్తుతం ఉన్న కుక్కల సంఖ్య : **76**

శాశ్వత ఆశ్రయ గృహాలు ఏర్పాటు చేయాలి...



గ్రేటర్ వరంగల్‌తో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో జూన్, జూలై నెలల్లోనే 712 కుక్క కరిచిన ఘటనలు నమోదయ్యాయి. కార్పొరేషన్ పరిధిలో పట్టుబడిన వీధి కుక్కలకు శాశ్వత ఆశ్రయ గృహాలు ఏర్పాటు చేసి, అక్కడే ఉంచి ఆహారం, వైద్యసేవలు అందించాలి.

–మండల పరశురాములు, అధ్యక్షుడు, అభ్యుదయ సేవా సమితి, వరంగల్

ఫిర్యాదులకు త్వరగా పరిష్కారం చూపాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట: ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులకు త్వరగా పరిష్కారం చూపాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్.. అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ పాల్గొని నగరవాసులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆయా విభాగాల ఉన్నతాధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలన్నారు. ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చూడాలని, 24 గంటల వ్యవధిలోగా శానిటేషన్ విభాగానికి అందిన ఫిర్యాదులు పరిష్కారం కావాలని ఆదేశించారు. గార్బేజ్ బిన్‌లు లిఫ్ట్ చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, పన్నుల విభాగానికి స్వీకరించిన ఫిర్యాదులు వారంలోగా పరిష్కారం చూపాలన్నారు. ఈనెల 21 వరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో బోనాలు పండుగలు జరుగుతున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణిలో ఇంజనీరింగ్ 23, టౌన్ ప్లానింట్ 44, హెల్త్ – శానిటేషన్ 11లతో పాటు వివిధ విభాగాలకు సంబంధించిన మొత్తం 91 వినతులు స్వీకరించినట్లు తెలిపారు.

ఎన్ఐఆర్ఎఫ్ వర్క్‌షాప్‌లో కేయూ వీసీ


వర్క్‌షాప్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, కేయూ ఐక్యూఏసీ డైరెక్టర్ జి. షమిత, డాక్టర్ ఫణీంద్రకుమార్, బన్నూర్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ సలహాదారు డాక్టర్ కె. వీరాంజనేయులు పవర్ పాయింట్‌ప్రజెంటేషన్ ద్వారా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో కొలమానం, విశ్లేషణ విధానాలు వివరించారని వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి. బాలకిష్టారెడ్డి నైపుణ్యాల అభివృద్ధికి అనుసరించాల్సిన కార్యాచరణను వివరించారు. తొలుత ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డి. రాజిరెడ్డి.. కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు.

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు అవసరం

- కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం

కేయూ క్యాంపస్: సమాజానికి ఉపయోగపడే నాణ్యతాప్రమాణాలతో కూడిన పరిశోధనలు అవసరమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. హనుమకొండ యూనివర్సిటీ న్యాయ కళాశాలలోని పీహెచ్‌డీ స్కాలర్లకు సోమవారం నిర్వహించిన ఓరియెంటేషన్ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఓరియెంటేషన్ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పరిశోధకులుగా మీ సిద్ధాంత గ్రంథాల్లో నాణ్యతాప్రమాణాలతో రూపొందించాలన్నారు. గౌరవ అతిథి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో ఆదర్శంతమైన పరిశోధకులుగా రాణించాలన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సుదర్శన్ మాట్లాడుతూ ఈ ఓరియెంటేషన్ తరగతులు వారంరోజులపాటు వివిధ సబ్జెక్టు నిపుణలతో పరిశోధనల అంశాలపై నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, శ్రీనివాస్, అధ్యాపకులు హరిప్రసాద్, సుజాత, వేదశ్రీ , లక్ష్మణ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ఫలితాల్లో భావన ప్రతిభ..

- రాష్ట్ర స్థాయిలో తృతీయస్థానం


భావనకు మెమోంటో అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసి ఎమ్మెస్సీ ఓబీజీ ఫలితాల్లో నర్సంపేటకు చెందిన వైద్యాధికారి పానుగంటి భావన ప్రతిభ కనబర్చి రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేటకు చెందిన మమత ఆస్పత్రి వైద్యులు భారతి, గోపాల్ దంపతుల కూతురు పానుగంటి భావన హైదరాబాద్ నాగోల్‌లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సెంటర్‌లో ఎమ్మెస్సీ ఓబీజీ విద్యనభ్యసించారు. ఈ క్రమంలో ఇటీవల వెల్లడైన ఫలితాల్లో కామినేని మెడికల్ కళాశాలలో ఓవరాల్‌గా ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించారు. ఈ సందర్భంగా కామినేని వైద్య కళాశాల యాజమాన్యం భావనను మెమోంటో అందజేసి సన్మానించారు. కళాశాల ఎండీ వసుంధర, శశిధర్, కళాశాల సూపరింటెండెంట్ అజయ్య, వైస్ ప్రిన్సిపాల్ పావని, అధ్యాపకులు, ఓబీజీ విద్యార్థులు, నర్సంపేట ఐఎంఏ అధ్యక్షుడు బీఎం జయుడు, డాక్టర్ ఉదయ్‌సింగ్, డాక్టర్ రాజారాంతోపాటు పలువురు వైద్యులు, నర్సంపేట విద్యాసంస్థల అధినేతలు తదితరులు అభినందించారు. కాగా, ఈ సందర్భంగా భావనను తల్లిదండ్రులు గోపాల్, భారతి అభినందించారు.

చైన్‌స్నాచర్లకు దేహశుద్ధి


పట్టుబడిన చైన్‌స్నాచర్లు

తొర్రూరు రూరల్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడి పారిపోతున్న ఇద్దరు యువకులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సోమవారం తొర్రూరు మండలం మాటేడులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మాటేడుకు చెందిన ముత్యం ప్రేమలీల రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఇతర రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ ప్రేమలీల మెడలోని పుస్తెలతాడును లాక్కొని పారిపోతుండగా బాధిత మహిళ కేకలు వేసింది. దీంతో స్థానికులు గమనించి ఆ యువకులను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులను వివరణ కోరగా ఆ యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE

- Ready to Occupy 1 BHK, 2BHK & 3 BHK Flats with all Facilities for Sale @ 941 Sqft to 1914 sqft with reasonable Prices at Vikas Nagar & Basith Nagar. Ph: 8897221187, 9177592357. [WA-6757]

SERVICES

- సిరి అసోసియేట్స్: హౌస్, బిజినెస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్, రేకుల & గూన, పెంకుటిల్లులపై రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25006814]

WANTED

- డ్రైవర్స్ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయుటకు DCM & బోలారో డ్రైవర్స్ కావలెను. ఫోన్ కాల్ టైమ్ 11am-6pm. Cell: 9396991649. [SCA25007145]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు గడువు..

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-2026 విద్యాసంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉంది. ఇంటర్ రెండేళ్లు, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ 10ప్లస్2 , పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందొచ్చు. ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు డిగ్రీ కోర్సుల్లో ఉచిత ప్రవేశాలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో వారు కూడా దరఖాస్తులు చేసుకునే వీలుకల్పించబోతున్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఆర్ఏఓయూ ఆన్‌లైన్ .ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సింటుంది.

సమతా సహాయక పథకం ప్రధాన సదుపాయాలు..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ సమతా సహాయక పథకం కింద ప్రధాన సదుపాయాలు ఇలా ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు కేవలం రూ .500 నమోదు రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.ట్యూషన్ ఫీజు ఉండదు. పరీక్ష రుసుములు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.
- ఉచిత కోర్సు మెటీరియల్, అవసరమైన పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. ఆన్‌లైన్ వనరులను ఉచితంగానే అందజేస్తారు. బీఆర్ఏఓయూ ఆన్‌లైన్ పోర్టల్ వీడియో, ఆడియో పాఠాలు, డిజిటల్ కోర్సు మెటీరియల్‌ను ఉచితంగానే అందుబాటులో ఉంటాయి.
- వారాంతంలో కౌన్సెలింగ్ తరగతులు, సమీప స్టడీసెంటర్లలో తరగతులకు హాజరు కావొచ్చు.
- తెలంగాణలోనే శాశ్వత నివాసి కావాల్సి ఉంటుంది. ప్రభుత్వ ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.
- ఫ్రీ షిప్ కొనసాగాలంటే గత సంవత్సరం అన్ని సబ్జెక్టులు ఒకేసారి ఉత్తీర్ణత కావాల్సి ఉంటుంది.

సమానత్వపు సమాజం దిశగా..



ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్య

- బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో సమతా సహాయక పథకం
- డిగ్రీలో ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు..
- స్టడీ మెటీరియల్, పాఠ్యపుస్తకాలు ఫ్రీ



కేయూ క్యాంపస్: సమాజంలో వివక్ష, అవహేళన, నిరాదరణకు గురవుతున్న ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇక నుంచి ఉన్నత విద్య అనే ఆయుధంతో సగౌరవంగా జీవించగలరు. ఆయా వర్గాల్లో విజ్ఞానం, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెరిగి స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో తాజాగా సమతా సహాయక పథకాన్ని (సమతా ఫ్రీషిప్స్) ప్రారంభించారు. విద్యను సామాజిక మార్పు, సాధికారతకు అత్యంత శక్తివంతమైన సాధనంగా గుర్తిస్తూ సమతా సహాయక పథకాన్ని చేపట్టారు. ఈ ఉన్నత విద్య డిగ్రీలో తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వర్గాలు, ప్రధాన సమూహాలకు ఉచిత విద్యనందించేందుకు నిర్ణయించారు. ఇప్పటికే ఆ యూనివర్సిటీ పాలకమండలి కూడా ఆమోదించింది. ఇందులో ప్రధానంగా ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఈ సమతా సహాయక పథకం కింద ఉన్నత విద్య డిగ్రీ చదువుకునేందుకు ఈ విద్యాసంవత్సరం 2025-2026లోనే ఉచిత విద్యనందించబోతుంది. ఈ మేరకు అడ్మిషన్ల ప్రక్రియ, ప్రొఫార్మాలో మార్పులు చేపట్టారు. దీంతో ఆర్థిక సమస్యలు, వివిధ కారణాలతో ఉన్నత విద్యకు దూరమైన ఆయా వర్గాలు చదువుకునే వీలు కలగబోతుంది.

ఆదివాసీల్లో ఈతెగలకు..

ఆదివాసీల్లో ప్రధానంగా తెలంగాణలో ఉన్న చెంచులు, గోండులు, కోయ, గొత్తికోయ, కొండరెడ్లు, నాయక్ పోడ్, పార్ధాన్, తొటి తెగల్లోని యువతకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉచిత విద్యనదించబోతున్నారు. కేవలం రూ. 500 ఫీజు రిజిస్ట్రేషన్‌తోనే అడ్మిషన్లు కల్పిస్తారు. పుస్తకాలు కూడా అందజేస్తారు. కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు వార్షిక ఆదాయం (తాజా) రూ. 2 లక్షల లోపు ఉన్న వారికి ఈ పథకం వర్తించనున్నది.

దివ్యాంగులకు..

దివ్యాంగులకు కూడా పథకం వర్తింపజేశారు. 40 శాతం వైకల్యం కలిగిన యువత డిగ్రీలో ప్రవేశాలు పొందొచ్చు. నామినల్ ఫీజు వీరికి కూడా రూ. 500 మాత్రమే. వీరికి గతంనుంచే పరీక్ష ఫీజు కూడా లేదు. నివాస ధ్రువీకరణపత్రంతోపాటు వార్షిక ఆదాయం రూ. 6లక్షల లోపు కలిగి ఉన్న వారు కూడా అర్హులే. సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.

ట్రాన్స్‌జెండర్లకు..

ట్రాన్స్‌జెండర్లు సమాజపు అపహాస్యం, వివక్ష కారణంగా ప్రధాన విద్యావ్యవస్థ నుంచి బయటకు నెట్టివేయబడుతున్నారు. వీరికి కూడా ఉచిత ఉన్నత విద్య అందించేందుకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవకాశం కల్పించేందుకు ఉపక్రమించింది. ఈ వ్యవస్థాపరమైన అసమానతలను తగ్గించడమే లక్ష్యంగా సమతా సహాయక పథకాన్ని రూపొందించారు. ట్రాన్స్‌జెండర్లు జెండర్ ధ్రువీకరణపత్రం, ఆదాయం అర్బన్ ప్రాంతంవారికి రూ. 2లక్షల వరకు, గ్రామీణం రూ. లక్షా 50వేల వరకు ఉన్న వారికే ఈపథకం వర్తింపు. వీరు కూడా రూ .500 ఫీజుతో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఉచిత విద్యతో నమోదు పెరగనుంది..



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో ఆదివాసీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్యను ప్రవేశపెట్టిన నేపథ్యంలో వివిధ కోర్సుల్లో నమోదు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఈయూనివర్సిటీ పరిధిలో 104 స్టడీ సెంటర్లు ఉన్నాయి. డిగ్రీ, పీజీ డిప్లొమా కలిపి సుమారు 39 కోర్సులు నిర్వహిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్టడీ సెంటర్లు ఉన్నాయి. సమతా సహాయక పథకం కింద ఆర్థిక, సాంస్కృతిక అడ్డంకులు తొలగి సమానత్వ సమాజం ఏర్పడుతుందని భావిస్తున్నాం. ఆయా వర్గాల్లో విజ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరిగి స్వయం సమృద్ధి సాధిస్తారు.

– డాక్టర్ వై. వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థి సేవావిభాగం డైరెక్టర్

అరుణకీర్తిపతాకకు గజల్ కవి పురస్కారం


అరుణకీర్తిపతాకకు గజల్ కవి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

హన్మకొండ కల్చరల్ : హనుమకొండకు చెందిన గజల్ రచయిత్రి, గాయని గంకిడి అరుణకీర్తిపతాక రెడ్డికి గజల్ కవి పుస్కారం అందజేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన గజల్ కవయిత్రి విజయగోలి రాసిన మూడో గజల్ సంపుటి నవరాగిణి పుస్తకావిష్కరణ, తెలుగు గజల్ గాన విభావరి జరిగాయి. ఈ కార్యక్రమంలో అరుణకీర్తిపతాక పాల్గొని గజల్ వినిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అరుణకీర్తిపతాకను సన్మానించి పురస్కారం అందజేశారు.

రచనలతో సమాజంలో మార్పు

- మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాల డీఎస్పీ కూజా విజయ్‌కుమార్


కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ కూజా విజయ్‌కుమార్

హన్మకొండ కల్చరల్ : కవులు తమ రచనల ద్వారా సమాజంలో మార్పులు తీసుకొస్తారని, రాసే పదాలలో నిగూఢార్థం దాగి ఉంటుందని మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాల డీఎస్పీ కూజా విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలో కవయిత్రి బాదం జయశ్రీ, వెంకటేశ్వర్లు దంపతుల షష్టిపూర్తి కార్యక్రమం జరిగింది. ఇదే సందర్భంలో జయశ్రీ రాసిన 'మదిలో మెదిలిన మాటలు' కవితాసంపుటి ఆవిష్కరణ జరిగింది. డీఎస్పీ కూజా విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. విశిష్ట అతిథి, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ కవితలు ప్రతీఒక్కరిని ఆలోచింపచేసేలా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జయశ్రీ పుస్తకాన్ని తన భర్త వెంకటేశ్వర్లుకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో సామ్య, రాకేశ్, రెయాన్ష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు..

- ప్రభాకర్ హత్య ఘటనలో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : మద్యం మత్తు మిత్రుడి ప్రాణం తీసింది. మహబూబాబాద్ పట్టణంలోని లెనిన్ నగర్ కాలనీకి చెందిన యువకుడు తూళ్ల ప్రభాకర్ ఈ నెల 3వ తేదీన దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లెనిన్ నగర్ కాలనీకి చెందిన సంపతి శ్రీను, తూళ్ల ప్రభాకర్ స్నేహితులు. ఈ నెల 3వ తేదీన రాత్రి ప్రభాకర్ మద్యం సేవిస్తున్నాడు. ఎందుకు తాగుతున్నావని అప్పటికే మద్యం సేవించి ఉన్న శ్రీను అడిగాడు. ఈ క్రమంలో ప్రభాకర్ నువ్వేంది నాకు చెప్పేదని శ్రీనును అసభ్యకర పదజాలంతో దూషించాడు. ఫలితంగా ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ జరిగింది. దీంతో కోపోద్రేకుడైన శ్రీను.. పక్కన ఉన్న కర్రతో తల, ముఖంపై కొట్టగానే ప్రభాకర్ తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయి కొంత సమయానికి మృతిచెందాడు. భయంతో శ్రీను అక్కడి నుంచి ఖమ్మం వెళ్లి అక్కడ మిల్లుల్లో పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో రైలులో మహబూబాబాద్ వచ్చి ఇంటికి వెళ్తుండగా పోలీసులు కనిపించారు. దీంతో భయంతో పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తూళ్ల ప్రభాకర్‌ను హత్య చేసింది తానేనని ఒప్పుకున్నాడు. దీంతో శ్రీనును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు.

టీచర్లు కొడుతున్న విషయం చెప్పొద్దు..

- అలా చేస్తే టీసీలు ఇచ్చి ఇంటికి పంపుతా..
- విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎస్ఓ
- అధికారులు పట్టించుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు


బచ్చన్నపేట కేజీబీవీ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు(ఫైల్)

బచ్చన్నపేట : విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత గురువులదే. అయితే గురువులే ఇబ్బందులకు గురి చేస్తే ఆ విద్యార్థులు ఎవరికి చెప్పుకోవాలి. టీచర్లు కొడుతున్న విషయం తల్లిదండ్రులకు చెప్పొద్దని, ఒకవేళ చెప్పితే టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తానని స్పెషలాఫీసర్(ఎస్ఓ) భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు విద్యార్థినులతోపాటు తల్లిదండ్రులు వాపోయారు. మండల కేంద్రంలోని కేజీబీవీ స్పెషలాఫీసర్ గీత విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తల్లిదండ్రులు శుక్రవారం నిరసన తెలిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. రాఖీ పండుగ నిమిత్తం తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు గురువారం ఉదయం రాగా వారితో స్పెషలాఫీసర్ దురుసుగా ప్రవర్తించారు. గురువారం వస్తే శుక్రవారం ఉదయం రమ్మని తెలిపారు. దీంతో మరుసటి రోజు ఉదయం వెళ్తే సాయంత్రం వరకు ఆగాలని తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేశారు. తమ పిల్లలను టీచర్లు కొడుతున్నారని, ఆ విషయాన్ని తమకు చెప్పితే టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తానని విద్యార్థినులను స్పెషలాఫీసర్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. పాఠశాలలోకి అధికారులు, పాత్రికేయులు వెళ్లొద్దని, కేవలం మహిళలను మాత్రమే అనుమతిమస్తామని ఎస్ఓ చెప్పారన్నారు. విద్యార్థులను కొట్టి ఆస్పత్రికి తీసుకెళ్లిన విషయం ఇతరులకు తెలియకుండా చీకటి గదిలో బంధించిన ఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు చదువుకోవాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని, పాఠశాలకు వెళ్లమని మారాం చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, కలెక్టర్.. పాఠశాలను తనిఖీ చేసి సదరు స్పెషలాఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల స్పెషలాఫీసర్ గీతను వివరణ కోరగా రాఖీ పండుగకు తల్లిదండ్రులు కోరగానే విద్యార్థులను పంపించానని, కొట్టి చీకటి గదిలో బంధించానని పేర్కొనడంలో వాస్తవం లేదన్నారు. అనవసరంగా తమ పాఠశాలను బద్నాం చేస్తున్నారన్నారు.

లాభసాటి పంటలు ఎంచుకోవాలి

- రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- ఆయిల్ పామ్ సాగుతో అధిక రాబడి
- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: రైతులు లాభసాటి పంటలను ఎంచుకుని సాగు చేయాలని, అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఇంచర్ల శివారులో కేన్ బయో సైన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ధనసరి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పట్టుపరిశ్రమ శాఖ సంచాలకుడు షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్ దివాకరతో కలిసి శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ములుగు వ్యవసాయానికి అనువైన జిల్లా అన్నారు. ఆయిల్ పామ్ రైతులకు మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ములుగు జిల్లాలో ప్రస్తుతం 5 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోందని, అది వచ్చే ఏడాదికి 10 వేల ఎకరాలు పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు బీసీలకు 70 నుంచి 80 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. మూడున్నర ఏళ్లలో పంట కోతకు వస్తుందన్నారు. ఆయిల్ పామ్ గింజలు టన్ను రూ. 18 వేలు ఉందని, భవిష్యత్‌లో రూ. 25 వేలకు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో తక్కువ కష్టం.. అధిక రాబడి

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు తక్కువ కష్టం.. అధిక రాబడి ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆయిల్ పామ్ సాగుతో ప్రతీ ఏడాది రైతులకు రూ. లక్ష నుంచి లక్షన్నర వరకు లాభం చేకూరుతుందన్నారు. జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశం, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా సంఘాలకు విజయ డెయిరీ నుంచి గురుకులాలకు పాల సరఫరాకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. జిల్లాకు త్వరలో మరో ఐటీ కంపెనీ రాబోతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, కేఎన్ బయోసైన్స్ కంపెనీ ఎండి సుధారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క విమర్శించారు. ఈమేరకు సోమవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. రామరాజ్యం అంటే దొంగ ఓట్లతో దొడ్డిదారిన అధికారంలోకి రావడమా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. బీజేపీ నాయకులు రామభక్తులు అయితే ఎన్నికల కమిషన్ ద్వారా ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అణచివేతను ఆయుధంగా చేసుకుని అరెస్ట్‌లు చేయిస్తోందన్నారు. ప్రజాతీర్పుకు విరుద్ధంగా బీజేపీ దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని ఆధారాలతో సహా బయటపడిందని చెప్పారు. బీజేపీ దుర్మార్గపు నిర్ణయాలను ప్రతీ గడపకు వెళ్లి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన మహిళా చైతన్య దీప్తి..

- ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత హఠాన్మరణం


అనిశెట్టి రజిత(ఫైల్)

హన్మకొండ కల్చరల్ : మహిళా చైతన్య దీప్తి మూగబోయింది. హనుమకొండకు చెందిన ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత సోమవారం రాత్రి కన్నుమూశారు. అనిశెట్టి రజిత మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచారు. అనేక కథలు, విమర్శనవ్యాసాలు, సమీక్షలు, ఉద్యమ డాక్యుమెంట్లు రాశారు. కుటిలరాజకీయాలకు లేని బలం కలానికి, నిజానికి ఉందని నమ్మి కవిత్వమే శ్వాసగా జీవించారు. 52 సంవత్సరాలుగా కవితావ్యాసంగం కొనసాగిస్తూ, వివిధ ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ కూడా నిరాడంబరంగానే కనిపించేవారు. నాలుగు దశాబ్దాల కాలంలో జీవనదిలా అన్ని ఉద్యమాలకు ఊటనీరందిస్తూ చైతన్యాన్ని సజీవంగా ఉంచారు. ఆమె కవితలో శిల్పంపై వ్యామోహం తక్కువ, వస్తువుపై ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది.

ప్రస్థానం..

అనిశెట్టి రజితది హనుమకొండలోని కుమార్‌పల్లి. బాలరాజు, జయలక్ష్మి దంపతులకు 1958 ఏప్రిల్ 14న జన్మించారు. కాజీపేట ఫాతిమా బాలికల పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ(తెలుగు), ఎంఫిల్ పూర్తి చేశారు. అలాగే, ఇదే విశ్వవిద్యాలయంలో ఎంఏ(ప్రభుత్వ పాలనా శాస్త్రం) చదివి యునివర్సిటీ ఫస్ట్ ర్యాంకు సాధించారు. కేయూలోనే ఎంఫిల్ పూర్తిచేసి కొంతకాలం ఉమెన్స్ స్టడీ సెంటర్, ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పరిశోధకురాలిగా పనిచేస్తూ అనేక జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. 1969-71 మధ్య తెలంగాణ ఉద్యమం ముగింపు దశలో చురుగ్గా పాల్గొన్నారు. 1975లో పైసా కవితతో స్టేజీపై కవితలు చదవడం ఆరంభించారు. అప్పటి నుంచి నిరంతరం కృషి చేస్తూ దళిత, బహుజన, స్త్రీ వాద, పౌర, మానవ హక్కుల, సాహిత్య, సామాజిక ఉద్యమాలన్నీటిలోనూ మమేకమై అనేక స్థానిక, జాతీయ వేదికలు, సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేశారు.

ప్రచురణలు..

గులాబీలు జ్వలిస్తున్నాయి(1984), నేనొక నల్లమబ్బునవుతా(1997), చెమటచెట్టు(1999), ఓ లచ్చవ్వ (దీర్ఘకవిత 2000–2005), ఉసురు(కవితా సంపుటాలు 2002), గోరంతదీపాలు (నానీలు 2005), దస్తఖత్ (హైకులు 2005), అనగనగా కాలం (2005), మట్టిబంధం (కథలు 2006), నన్నే ఓ నన్నే (నానీలు 2007), మార్కెట్ స్మార్ట్ శ్రీమతి. (దీర్ఘ కవిత 2010)

సంపాదకీయాలు..

వెతలే కథలై(రచయిత్రుల కథాసంకలనం 2011), ఊపిరి (తెలంగాణలో ఆత్మహత్యలపై నిరసన కవిత 2012), జిగర్ (తెలంగాణ విశిష్ట కవితా సంకలనం 2013), ఉద్విగ్న(లైంగిక భారతంపై ఓరుగల్లు కవుల నిరసన 2013), ఆకాశపుష్పం (అపూర్వ త్యాగానికి నీరాజనం 2014), ముజఫర్‌నగర్ మారణ కాండ(నిషిద్ధమేఘాల్లోకి మాయాత్ర 2014),2 014లో పోలవరం ప్రాణాంతక ప్రయోగం వెలువరించగా 2016లో అక్షరశరధి దాశరథి, నిర్భయాకాశం పుస్తకాలు ప్రచురించారు. 2017 ఆమె సంపాదకత్వంలో భిన్న అస్తిత్వాల స్త్రీల సాహిత్యం– పరిచయ వ్యాసాలు తీరొక్క పూల పుస్తకం వెలువరించారు.

అవార్డులు..

2017లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ప్రతిభాపురస్కారం, అలిశెట్టి ప్రభాకర్ స్మారక పురస్కారం, లయన్స్ ఇంటర్నేషనల్ పురస్కారం, కృష్ణవేణి కళాసమితి ఉగాది పురస్కారం తదితర అనేక అవార్డులు ఆమె సొంతం చేసుకున్నారు.

ఎంపీ సంతాపం..

రజిత హఠాన్మరణం పట్ల వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీలోకానికి, వరంగల్ సాహితీ రంగానికి రజిత మృతి తీరని లోటని పేర్కొన్నారు.

నేడు కేఎంసీకి రజిత పార్థివదేహం అప్పగింత

రచయిత్రీ అనిశెట్టి రజిత పార్థివదేహాన్ని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగించనున్నారు. రజిత వివాహం చేసుకోలేదు. ఆమెకు సొంతిల్లు లేదు. ఈ నేపథ్యంలో కేయూ ఫస్ట్ గేటు దగ్గర గల కేయూ విశ్రాంతాచార్యులు కాత్యాయనీవిద్మహే గృహంలో రజిత పార్థివదేహాన్ని సందర్శనార్థం ఉంచారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఐ' బ్యాంక్ టెక్నీషియన్లు రాత్రి ఆమె కళ్లను సేకరించి భద్రపరిచారు.